

# ఇలా జరుగుతుందనుకోలేదు

• దాస్ బాబు

ఈ సంఘటన జరిగి ఆరునెలలు కావొస్తుంది— కాని మర్చిపోవాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఆ దృశ్యం నాకళ్లముందు మెదుల్తుంది నన్ను చిత్రహింస చేస్తుంది.

రాంచినుండి అన్నాయ్ నన్ను రమ్మని ప్రతి శెలవలముందు వ్రాసేవాడు దూరప్రయాణం విసుగని యేదోసాకుచెప్పి తప్పిస్తూ వచ్చాను కాని పోయిన వేసవి శెలవల్లో వెళ్లక తప్పిందికాదు

అసలు అన్నాయే వచ్చాడు—విజయవాడలో తన మిత్రుని పెళ్లివంక మీద. అతను కూడా డాక్టరే

అప్పటికి నా పరీక్షలయ్యాయ్ అమ్మతో చెప్పి ప్రయాణంకట్టాడు

'ఆడపిల్ల అంతదూరం యెందుకని' అమ్మ గొణిగి వూర్కుంది.

'వెళ్ళొస్తావమ్మా' అని మాత్రం అన్నాడు నాన్న

నాకుమట్టుకు ఆట్టే యిష్టంలేదు అయినా ఒకసారి వదిన్ని, కిట్టిగాన్ని చూడొచ్చు నన్న ఆశకొద్ది బయలుదేరాను కాని యిలా జరుగుతుందనుకోలేదు.

రెండురోజుల ప్రయాణం.

చాలా చిరాకుగావుంది

మెయిలని పేరేగాని గుర్తొచ్చినప్పుడల్లా ఆగుతూ—పొలాల్ని, జీడిమామిడి తోటల్ని పరామర్శిస్తూ, అవలింతలతో ఖరగ్‌పూర్ చేరుకొంది

దీనికితోడు అన్నాయ్ వర్ణన

బీహారులో క్షామపీడితుల తాగ క్షేమాలు!

ఒకరోజంతా వీళ్లనుగురించే పైగా మనం యేంచేద్దాం వీళ్లకోసం అంటాడు

మనం యేం చేస్తాం?

భగవంతుడికే లేని దయా దాక్షిణ్యాలు మరెవరికుంటాయని విస్తుపోతాడు

రెండో రోజంతా తన ఆస్పత్రి గొడవ.

రోగుల బాధ దగ్గరనుండి నర్సులు పడే బాధ వరకు వర్ణించాడు

ఈ రెండురోజులు నాకు సరిగ్గా నిద్ర పట్టింది కాదు రాంచి చేరుకొన్నాం

కిట్టి బెంగాలీ వాళ్లతో కలిసి వుంటాడట, నన్ను బెంగాలీలో పలకరించి నవ్వాడు

వదినకు నేనంటే చాలా ప్రేమ అమ్మకంటె ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది

నాలుగురోజులు అక్కడి విషయాలు, ఇక్కడి విషయాలు చెప్పుకొంటూ గడిపాం మరో నాలుగు రోజుల్లో చూడవలసిన స్థలాలన్నీ చూశాం రెండురోజుల పాటు విశ్రాంతి ఆ తర్వాత గంట గడపాలంటే యెంతో కష్టంగా వుండేది అన్నాయ్ పనిచేసే ఆస్పత్రి నాలుగుమైళ్ళదూరం వుంటుంది ఒకటి రెండుసార్లు వెళ్లాను. రోగాలకి అంకితం చేసుకొన్నవాళ్ల నిలయం. తేలికగా యెవరూ బాగుపడరు ఏడాదికెవరైనా బాగుపడి బయటపడినా—చెయ్యడానికేమీ లేదు—తింటానికేమీ దొరకదు. అందుకేనేమో ఆస్పత్రినుండి వెళ్లడాని కిష్టపడినట్లు లేరు దరిదాపుల్లో వున్న వాళ్లనంతా జమచేసి వాళ్లతో నానా అవస్థలు పడుతున్నారు ఆస్పత్రివాళ్లు.

మరో రెండురోజులు గడిచాయ్

సాయంత్రం చల్లగాలికి తోటలో కూర్చున్నాం

కిట్టి ప్రైవేటుకెళ్లి వచ్చాడు వదరుబోతు అదేపనిగ వాగేస్తున్నాడు

అంతలో ఆస్పత్రినుండి అన్నాయ్ వచ్చాడు.

వదిన లేచి నిలువబడింది

అన్నాయ్ దగ్గరకొస్తూ అన్నాడు—

'ఓ క్రిష్టియన్ ఫాదర్ నాతో కూడా వచ్చాడు'

వారిని చూట్టానికి లోపలికెళ్లాం.

అన్నాయ్‌కి మత పట్టింపులేవీ లేవ్.

వారు గదిలో కూర్చుని వున్నారు. అన్నాయ్ మమ్మల్ని పరిచయం చేశాడు

వారు బీహారు క్షామ పీడితులకు సహాయం చేస్తున్నారట. వదిన లోపలకెళ్లింది

కోటలం సందర్భంతో అన్నాను— యింట్లో కూర్చోవడం కష్టంగా వుందని ఫాదర్ నవ్వుకొంటూ అన్నారు—మాతో కలిసి నాలుగురోజులు పని చెయ్యమని. వారికి తెలుగురాదు ఇంగ్లీష్‌లో మాట్లాడారు ఆమాటకొస్తే మాయింట్లో తప్పితే బయట కెక్కడికి వెళ్లినా ఇంగ్లీషులోనే మాట్లాడుల్సొచ్చింది

వదిన కాఫీ తెచ్చింది

అన్నాయ్‌వైపు చూశాను

అన్నాయ్ చెప్పాడు నీ విషయం వదినతో.

ఆమె మామూలు ధోరణిలో అంది— ‚ఎండలో అమ్మాయిని త్రిప్పడం యేం బావుంటుందని'

అయినా నేను ఒప్పుకొన్నా కాని.

ఇలా జరుగుతుందనుకో లేదు

ప్రొద్దున్నే మా యింటికి వ్యాన్ వస్తుంది ఫాదర్‌తోబాటు మతో యిద్దరుంటారు అంతాకలిసి దగ్గరున్న పల్లెటూర్లకు వెళ్లి పొత్తిగా యేమీలేని వాళ్లను పరామర్శించాలి. కూడా తీసుకెళ్లిన గోధుమ పిండి యింటికి రెండేసి కిలోలు యివ్వాలి. ఇది అనుకొన్నంత తేలికేమీకాదు ఎవరికేమీవుందో యేమిలేదో ముందు తెలుసుకోవాలి నేనువెళ్లిన ప్రాంతాలన్నీ ఒకటే ఎవరికీ యేమిలేదు కనీసం శుభ్రంగా త్రాగడానికి మంచి నీళ్లైనా లేవు అంతా యిండ్లముందు కూర్చొంటారు — పిల్లల్ని ముందేసుకొని ఖాళీ గిన్నెల్నిచూపి పిల్లలు యేడుస్తుంటే వాళ్లను చూసి పెద్దలు యేడుస్తుంటారు. ఎక్కడకెళ్లినా యివే దృశ్యాలు కొంత మందికి మరోవిధంగా సహాయం లభిస్తుంది ఏమీ దొరకని వాళ్ల జాబితా తయారు చెయ్యాలి ముందు ఆ తర్వాత పంపకం. నాకు యిలాంటి జాబితా తయారుచేసేపని పెట్టారు

వ్యాన్‌లో వెళ్లడం— వ్యాన్‌లో రావడం. డ్రైవరు బోసు సహాయంతో ఒగంటలో పేర్లు వ్రాసుకరావడం ఫాదర్‌కు యివ్వడం

మొదటి రెండు రోజులు సరదాగానే గడిచాయ్.

మూడురోజు రాత్తూరో అవే పల్లెటూరికి వెళ్లాం. మరీ అంత అధ్వాన్నంగా యేమీ-లేదు అక్కడ పరిస్థితి. రెండవసారి తవ్విస్తున్నారట అక్కడ.

ఊరిబయట పెద్దబావి తీస్తున్నారు. తాడునబట్టి బావి యెంత లోతువుంది వూహించుకోవచ్చు ఇంకా లోతుగ త్రవ్వుతున్నారు ఆవూరి వాళ్లు చాలామంది వున్నారక్కడ ఫాదర్‌కు తెలిసిన వాళ్లు వుంటే కొద్దిసేపు ఆగి వాళ్లతో మాట్లాడి వూరిలోకి వెళ్లాం ఓచెట్టుక్రింద వ్యాన్ ఆపుజేసి ఫాదర్ ఒకవైపు, నేను బోసు మరోకవైపు వెళ్లాం

బోసుకు ఓ మాదిరిగ యింగ్లీష్ వొస్తుంది నాతో మాట్లాడాలని అతనికి చాలా యిష్టం. ఏదో ఒకటి యెప్పుడు చెప్తూనే వుంటాడు కొన్నిసార్లు తనేమి చెప్పేది నాకర్థ మయ్యేదికాదు

ఇంటింటికి తిరిగి పదిపేర్లు వ్రాశాను.

చివరింటికి వచ్చాం.

అతనితో పరిచయం యిక్కడనే జరిగింది.

ఇంటి అరుగుమీద ఒక్కడే కూర్చొని మావైపు చూస్తున్నాడు.

దగ్గర కెళ్లాం.

పల్లగ, దవుడలు పీక్కుపొయ్యి, చిరిగిపోయిన దుప్పటిమీద వేసుకొని వున్నాడు

అతను కళ్లు పెద్దవిచేసి నావైపు అదేపనిగ చూస్తుంటే అదోమాదిరిగ అనిపించింది

అతనలా చూట్టం బోసు కిష్టంలేదు ఆచూపులు మళ్లించడానికి నాలుగైదు సార్లు ప్రయత్నించాడు, యేవో ప్రశ్నలడిగి

కాని రెప్పలైనా వాల్చకుండ వింతగ చూస్తున్నాడు

పేరు వ్రాయక ముందు అడిగే నాలుగు ప్రశ్నలు అడిగాను.

బోసు తర్జుమా చేసి అడిగాడు కోపంగా

కాని అతనేమి జవాబివ్వలేదు.

అలాగే చూస్తున్నాడు నా వైపు వికారంగా.

పేరు అడగమని బోసుతో అన్నాను.

దానికీ జవాబు లేదు.

చాలా కోపమొచ్చింది.

'చావనీయ్' అని వెనుక్కు తిరిగాను.

మేమిద్దరం వ్యాన్ దగ్గర కొచ్చాం.

ఫాదర్ నా కోసం యెదురు చూస్తున్నారు,

నా జాబితా యిచ్చాను

ఇంటికి మూడు కిలోల పిండి యివ్వొచ్చునని అంచనా వేశారు ఆ తర్వాత పంపకం జరిగింది.

వ్యాన్‌లో కూర్చోడానికి వెనక్కు తిరిగాను

అతను చెట్టు ప్రక్కగా నిలువబడి నా వైపు చూస్తున్నాడు అవే చూపులు.

ఫాదర్ అతని దగ్గర కెళ్లాడు.

నేను లోపల కూర్చున్నా

కొద్దిసేపట్లో ఫాదర్ నా దగ్గర కొచ్చి— 'నీకేమి అభ్యంతరం లేకపోతే యితన్ని కూర్చోనివ్' అంటూ తలుపు తెరిచి అతన్ని పిలిచాడు

ఫాదర్ వైపు చూశాను, కాని తనేమి పట్టించుకోలేదు అతనొచ్చి నా ప్రక్కలో కూర్చున్నాడు— నా వైపు చూస్తూ. అవే చూపులు.

వ్యాన్ కదిలింది.

ముళ్లకంప మీద కూర్చున్నట్లుంది.

అతనింకా అలాగే చూస్తున్నాడు — దిష్టిబొమ్మలా.

నా పర్సులో నుండి కాడ్‌బరీ చాక్లెట్ తీసుకొని తిన్నాను దానిమీద కాగితం నలిపి కాళ్ల దగ్గర పడేశాను.

అతను దాన్ని పైకితీసి జాగ్రత్తగా మడతలు సరిజేసి జేబులో పెట్టుకొన్నాడు పర్సులో మరో చాక్లెటు వుంది దాన్ని అతని కివ్వబోయాను — కాని మనిషిలో చలనం లేదు కాస్త చెయ్యిచాపి అతనికి దగ్గరగా వుంచాను

అడివి మనిషి, యేమి తెలిసినట్లు లేదు అలాగే చూస్తున్నాడు.

కోపంగా పర్సులో పడేశాను చాక్లెట్లును

నా సహాయానికి నోచుకోలేను.

పైగా నా ప్రక్కలో కూర్చున్నారు

వ్యాన్ మలుపు తిరిగి బావి దగ్గర కొచ్చింది.

ఫాదర్ క్రిందకు దిగాడు

నాకూ దిగాలని పించింది. ఇవతలి తలుపు తెరుచుకొని దిగాను. నా వెనకాలే అతనూ బయట కొచ్చాడు — నా నీడలా, పల్లగా.

బావిలోనుండి రాళ్ళు, బురద తోడేస్తు

న్నారు.

బావిదగ్గర కెళ్ళాను ఫాదర్ వాళ్ళను పలకరిస్తున్నారు

నాకో ఆలోచన తట్టింది

ఇతనుకూడా వాళ్ళతో పనెందుకు చెయ్యకూడదు?

ఎంత దరిద్రానికి దాసుడైనా సహజంగావుండే బలం వుడిగిపోలేదు

ఫాదర్‌తో నెమ్మదిగా చెప్పానా వుద్దేశం

అతన్ని పిలిచి ఈవిషయం చెప్పాడు. పైగా వేసిచ్చిన సలహాలా చెప్పినట్లుంది అతను నావైపు చూశాడు అదోమాదిరిగ బావివైపు నావైపు చూస్తూ ముందు కెళ్ళాడు.

ఫాదర్ యేమిటో చెప్పాడు అతనితో

నేనొచ్చి వ్యాన్‌లో కూర్చొన్నా చాలా తేలికగా

పీడ వదిలిందనుకొన్నా, కాని

ఇలా జరుగుతుందనుకో లేదు

వ్యాన్ కదిలింది

'అతని పేరు ఉదయభాన్ ఒకప్పుడు పెద్ద రౌడీ చుట్టుప్రక్కల అతనంటే హడల్ పెళ్ళిచేసుకొన్న తర్వాత చాలా మారాడు కాని పోయిననెల అతని భార్య చనిపోయింది పాపం ఒంటరిగాడు ఆమె చాలా అందంగా వుండేది' ఫాదర్ చెప్పాడు

నామనసెందుకో బాధపడింది

అతనూ, అతని చూపులు నాకళ్ళ ముందు మెదిలాయ్

నావైపు అలా చూట్టంలో అతని వుద్దేశ్యమేమిటో?

ఆచూపులకేమైనా అర్థముందా?

నన్నెలా వూహించుకొన్నాడో?

ఇవే తలంపులు

వ్యాన్ మాయింటిముందు ఆగింది.

నేను లోపల కెళ్ళాను

స్నానంచేసి భోజనానికి కూర్చున్నా

"ఏమిటి ఈరోజు విశేషాలు?" వదిన అడిగింది.

అతనూ అతని చూపులు నాకళ్ళముందు మెదిలాయ్

'ఈరోజు ఒకవింత మనిషినిచూశార' నవ్వుకొంటూ అన్నా

'వింతమనిషా? ఎక్కడా?' దీర్ఘంతీస్తూ అంది.

## ఇలా జరుగుతుంది...

గట్టిగ నవ్వాను ఆమె బిత్తరపోయింది.

'పిచ్చివదినా' జరిగిందంతా చెప్పాను.

'అదేపనిగ దిష్టిబొమ్మను చూసినట్లు చూస్తే నాకు బలేకోపం వచ్చింది తెలుసా?' అన్నాను

'మరింత అందంగా యేందుకున్నావ్?' వదిన అంది

'ఉంటే?'

వదిన గట్టిగ నవ్వింది.

భోజనాలయ్యాయ్

పేపరు ముందేసుకొని కూర్చొన్నా అతను నా కళ్ళముందు మెదిలాడు

అవే చూపులు

అత నెందుకలా చూస్తుంది ఎంతకీ బోధపడ లేదు

పేపరు ప్రక్కగా నెట్టి బలవంతాన నిద్రపోయాను కిట్టి ప్రైవేటు నుండి వచ్చి నన్ను లేపాడు


'వసుంధరా ఆస్పత్రికి వస్తావా?' అంటూ అన్నాయ్‌దగ్గర కొచ్చాడు నా మగతను గమనించి మళ్ళీ అడక్కుండనే వెళ్ళిపోయాడు ఆ సాయంత్రం తోటలోనే గడిపాం.

రాత్రి వదినా నేనూ చదరంగం ఆడి పండుకొన్నాం

అన్నాయ్ చాలా ఆలస్యంగా వచ్చినట్లుంది ప్రొద్దున్నే వెళ్ళిపోయాడు కూడా.

పదిగంటలకల్లా వ్యాన్ వొస్తుంది కాని ఆ రోజు వెళ్ళడానికి సహించలేదు ఫాదర్‌తోచెప్పి అసలు మానుకొందామని వరండాలో కూర్చొన్నాను

పదకొండు దాటింది—వ్యాన్ జాడలేదు




కిట్టికి లెక్కలుచెప్పి భోజనానికి లేచాను ఆరోజు వెళ్ళడం తప్పింది. కాని అతను నా కళ్ళముందు మెదిలాడు

అవే చూపులు

భోజనాలయిన తర్వాత చదరంగం ఆడాం నేను ఓడిపోయాను. వదిన గెల్వడం అదే మొదటిసారి అన్నయ్యను నిద్రలేపి మరీచెప్పింది

సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నా ఇద్దరం ఆస్పత్రికి వెళ్ళాం.

అన్నాయ్‌దగ్గర కొద్దిసేపుండి వార్డులు చూట్టానికి బయలుదేరాను చాలా పెద్ద ఆస్పత్రి చివరి వార్డుకి వచ్చాను తలుపు ప్రక్కలోవున్న టేబులు దగ్గర కూర్చొని సిస్టర్ రిపోర్టులు వ్రాసుకొంటుంది నేనామెకు తెలియదు పరిచయం చేసుకొన్నా ఆ వార్డులోవున్న రోగుల్ని చూసుకొంటూ చివరి బెడ్‌దగ్గర కొచ్చాను మెడవరకు దుప్పటి కప్పివుంది కళ్ళు మూసుకొని భారంగా శ్వాసిస్తున్నాడు

దగ్గర కెళ్ళాను

అతను ఉదయభాన్!!

నా గుండె వేగంగా కొట్టుకొంది.

అతనెందుకొచ్చాడు? ఏమైంది?

తల దగ్గరగావెళ్ళి చార్టు చూశాను. నా కర్థంకాలేదు

చార్టు గోడకు తగిలిస్తుంటే జారి పడింది ఆ శబ్దానికి అతను కళ్ళు తెరిచాడు

నావైపు చూశాడు

నన్ను గుర్తుపట్టాడేమో, ఆచూపుల్లో ఓ మూల కాంతి కనిపించింది అతని పరిస్థితి నాకేమి అర్థంకాలేదు అలానే చూస్తూ నిలబడ్డాను అతనూ చూస్తూనే వున్నాడు

నా పర్సులోనుండి చాక్లెట్ తీసి కివ్వబోయాను కాని, తీసుకోలేదు అతను చూసేలా ప్రక్కనున్న బల్లమీద పెట్టాను.

అటు యిటూ మెదిలి 'పానీ' అన్నాడు.

అదే మొదటిసారి అతను మాట్లాడటం.

బల్లప్రక్కగా కూజా, గ్లాసువున్నాయ్. గ్లాసులో నీళ్ళుపోసి అతని దగ్గరకు తీసుకెళ్ళాను

నా వైపు అలాగే చూస్తున్నాడు.

'పానీ' అని నెమ్మదిగా అన్నాను.

అతను నోరు తెరిచాడు

అంటే అతని వుద్దేశం—నేను తాపించానా ?

సిస్టర్ పిలిచి గ్లాస్ చేతికిచ్చాను. అప్పుడు చెప్పింది.

చిన్న బావి పూడిక తీస్తుంటే పెద్ద రాయి చేతులమీద పడిందట చేతులు నలిగి పోయాయ్. రెండు చేతులు గూడల వరకు తీసేశారు. ఆమె దుప్పటితీసి చూపించింది.

నేనా దృశ్యం చూడలేక పోయాను.

గట్టిగ కళ్ళు మూసుకొన్నా రెండు చేతులతో. భగవంతుడా యేమిటీ ఘోరం?

కళ్ళు తెరిచేటప్పటికి సిస్టర్ అతనికి నీళ్ళు తాపిస్తుంది. ఆమె గుండె మీద అతని తలవుంది. నా వైపు అదోలా మారిగ చూసింది. నా నోటివెంబడి మాట రాలేదు.

అతనివైపు చూసే ధైర్యంకూడా లేదు వెంటనే యింటికి వచ్చేశాను.

ఇలా జరుగుతుందనుకోలేదు.

ఆరాత్రినేను పడినబాధ భగవంతుడికే తెలును.

అతనలా అవడానికి కారణం నేనుకాదని ఎన్నివిధాల చెప్పుకోవాలని ప్రయత్నించినా నా మనస్సాక్షి ఒప్పుకోలేదు.

కనీసం అతనికి మంచి నీళ్ళైనా యివ్వలేకపోయాను.

ఫాదర్, నేనూ తప్పితే మరెవరూ లేరేమో అతనికి.

చేతులు లేనిమనిషి జీవితం చావుకంటె ఘోరం.

ఏడ్చిఏడ్చి నిద్రపోయాను—ఒక నిశ్చయానికొచ్చి.

ఉదయాన్నే పాలు తీసుకెళ్లి అతనికివ్వాలి. నాచేతులతో తాపిస్తే యింత పువశాంతైనా కలుగుతుందన్న నమ్మకంతో ప్రొద్దున్నే లేచాను.

అన్నాయ్ వదిన యెవరూ లేవలేదు.

పాలు ఫ్లాస్కులో పోసుకొని, కారు బయటకు తీసుకొని ఆస్పత్రికి వెళ్ళాను.

గబగబా చివరివార్డుకు వెళ్ళాను.

సిస్టర్ వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది.

నన్ను చూసిందిగాని పలకరించలేదు.

తల దించుకొని చార్టులు పూర్తి చేస్తుంది.

'ఉదయభానుకి పాలు తెచ్చాను' అన్నాను కాని ఆమె జవాబివ్వలేదు.

'అతనికిచ్చేస్తా...' నంటూ రెండడుగులు వేశాను.

నన్ను పిలిచింది.

ఆగి ఆమెవైపు చూశాను.

'నిన్న మిమ్మల్ని నీళ్ళడిగితే కళ్ళు మూసుకొన్నారు... ఇప్పుడు పాలు యివ్వడానికొచ్చారా?' అంది ఎత్తిపొడుస్తూ.

కోపంగా చూశాను.

'మీరు చాలా ఆలస్యంగా వచ్చారు, రాత్రి అతను చనిపోయాడు,'

నాచేతిలో ఫ్లాస్కు జారిపోయింది.

ఒళ్ళంతా కంపించింది.

నాకు తెలియకుండానే అతని మంచం దగ్గర కెళ్ళాను. అతను లేడు.

బల్లమీద రెండు చాక్లెట్లు కాగితాలున్నాయ్.

అతను నా కళ్ళముందు మెదిలాడు.

అవే చూపులు ...

నా హృదయాన్ని దహించి వేస్తున్నాయ్.

ఇలా జరుగుతుందనుకోలేదు. ●




M 221 TL